క్లుప్తంగా

అగ్నిగుండ మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో ద్రౌపదీ దేవి

నింద్ర: మండలంలోని అత్తూరు గ్రామంలో ద్రౌపదీ అమ్మవారి తిరునాళ్లలో భాగంగా ఆదివారం అగ్నిగుండ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ద్రౌపదీ దేవిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. సాయంత్ర భక్తులు అగ్ని గుండం ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వేగంగా గ్యాస్‌పైప్ పూడిక పనులు



బైపాస్‌లో జరుగుతున్న పనులు

నగరి: ఇంటింటికీ గ్యాస్ సరఫరాలో భాగంగా గ్యాస్‌పైపుల పూడిక పనులు వేగంగా జరుగుతున్నాయి. నగరి బైపాస్ రోడ్డులో ప్రస్తుతం గ్యాస్‌పైపుల అమరిక పనులు జరుగుతోంది. పైపుల పూడిక పనులు ఇంకా 15 కిలోమీటర్ల మేర తిరుత్తణి వరకు జరగాల్సి ఉంది. అక్కడ ఏర్పాటు చేసే ఫిల్లింగ్ స్టేషన్ వరకు పూడిక పనులు పూర్తయితే పైపుల ఏర్పాటు పనులు పూర్తయినట్లే అని లేబర్ కాంట్రాక్టర్ తెలిపారు.

17న అమావాస్య కూటం

పుత్తూరు రూరల్: స్థానిక ద్రౌపదీ దేవి సమేత శ్రీధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఈనెల 17వ తేదీ అమావాస్య కూటం(సమీక్ష) నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బీఎస్ మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా శ్రావణ మాసంలో పది రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై చర్చించనున్నారు. ఉభయదారులు, గ్రామ పెద్దలు పాల్గొని తగిన సహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్‌గా మనోహర్



గంగాధరనెల్లూరు(కార్వేటి నగరం): స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్‌గా వీరకనెల్లూరు పంచాయతీ పేటనత్తం గ్రామానికి చెందిన మనోహర్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు.

నేడు జగన్నాథపురంలో జగనన్న సురక్ష

విజయపురం (నగరి): మండలంలోని జగన్నాథపురం గ్రామంలో సోమవారం సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, సచివాలయ పరిధిలోని గ్రామస్తులు సురక్ష కార్యక్రమానికి హాజరుకావాలని తెలిపారు. అర్హత కలిగిన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న వెంటనే కుల, ఆదాయ, ఆధార్ లింక్, పట్టాపాసుపుస్తకం సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు, రేపు ఐఎఫ్‌పీపై శిక్షణ తరగతులు

సత్యవేడు : విద్యాబోధన అంశాలకు సంబంధించి పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో 10, 11 తేదీలలో నిర్వహించు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) శిక్షణ తరగతులకు సత్యవేడు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు హాజరు కావాలని ఎంఈఓ కె.రవి కోరారు. పీవీపురం, మాదనపాలెం, ఇరుగుళం, సత్యవేడు బాలుర హైస్కూళ్లు, సత్యవేడు బాలికల పాఠశాల, మదనంబేడు, రాజగోపాలపురం, పుదుకుప్పం, దాసుకుప్పం, గురుకుల బాలుర పాఠశాలలు, శిరునంబూదూరు, ఏఎం పురం, కన్నావరం ఉపాధ్యాయులు ఈ శిక్షణ తరగతులకు హాజరు కావాలని ఆయన కోరారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



సుగేంద్ర తీర్థ స్వామీజీ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఆదివారం తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, రాష్ట్ర హైకోర్టు జడ్జి రవీంద్ర బాబు, ఉడిపి పుతిగే మఠం పీఠాధిపతి సుగేంద్ర తీర్థ స్వామీజీ వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రగతి మణిహారం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వెదురుకుప్పంకు మహర్దశ
- రూ. 5 కోట్లతో అభివృద్ధి పనులు
- నాలుగేళ్లలో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన



నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్



వెదురుకుప్పం వ్యూ





సిమెంట్ రోడ్డుతో కళకళలాడుతున్న సంతబయలు రోడ్డు, పూర్తయిన ఓవర్ హెడ్ ట్యాంకు

వెదురుకుప్పం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మారుమూల ప్రాంతమైన వెదురుకుప్పంకు మహర్దశ పట్టుకుంది. అభివృద్ధి పనులతో రూపురేఖలు మారిపోతున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. సుమారు రూ. 5 కోట్లకుపైగా నిధులు వెచ్చించి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులు చేస్తున్నారు. గ్రామాల్లో వీధి లైట్ల నుంచి రోడ్ల ఏర్పాటు, వాణిజ్యపరంగా అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. టీడీపీ హయాంలో చెప్పుకోదగ్గ పనులు చేపట్టకపోవడంతో ఈ ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, ఆయన కుమార్తె స్థానిక సర్పంచ్ మరకాలకుప్పం శిల్ప ముందుండి పనులను పూర్తి చేయిస్తున్నారు. ఇటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అటు అభివృద్ధి పనులతో వెదురుకుప్పం గ్రామ సచివాలయం దూసుకుపోతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధిపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగనన్న కాలనీలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. మండలంలో గతంలో అగ్ని మాపక కేంద్రం ఉండేది కాదు. అగ్నిప్రమాదాల కారణంగా రైతులు నష్టాల పాలవుతుండడంతో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేసింది. ఇది కూడా ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడిందని స్థానికులు అంటున్నారు.

అభివృద్ధి జరిగిందిలా....

- వెదురుకుప్పం గ్రామ సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయయకుల సమన్వయంతో పనిచేస్తున్నారు. రూ. 5 కోట్లకు పైగా నిధులు వెచ్చించి పనులు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.
- రూ. కోటితో సీఆర్‌కండ్రిగ గ్రామం, దళితవాడ, వెదురుకుప్పం తూర్పు దళితవాడ, వెదురుకుప్పం ఆదిఆంధ్రవాడ నాలుగు గ్రామాలను కలుపుతూ కిలో మీటర్ మేరకు మురుగు నీటి కాలువ నిర్మాణం.
- వెదురుకుప్పంలో రూ. 21.5 లక్షలతో డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం నిర్మాణం
- జలజీవన్ మిషన్ కింద రూ. 25 లక్షలతో 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం.
- మండల కేంద్రంలో రూ. 3 లక్షలతో బాత్‌రూమ్‌ల నిర్మాణం
- ఎంపీపీ నిధులు రూ. 3 లక్షలతో జగనన్న కాలనీకి పైపులైన్ నిర్మాణం చేపట్టి తాగునీటి వసతి కల్పన.
- ఎంపీపీ నిధులు రూ. 2.40 లక్షలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- సీఆర్‌కండ్రిగలో జలజీవన్ మిషన్ కింద రూ. 1.50 లతో కొత్తగా బోరు, మోటారు ఏర్పాటు.
- పంచాయతీ నిధులు రూ. 2 లక్షలతో వెదురుకుప్పం ఆదిఆంధ్రవాడలో పైపులైన్ ఏర్పాటు, రూ. 2 లక్షలతో తంగేళిమిట్ట గ్రామంలో 100 మీటర్ల సిమెంటు రోడ్డు నిర్మాణం.
- సీఆర్‌కండ్రిగ నుంచి సంతబయలు గ్రామం వరకు 3 కిలోమీటర్లు రూ. 2 కోట్లతో ఈఏపీ(ఎక్స్‌టెర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టు) కింద సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారు.

రూ. 50 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

వెదురుకుప్పం మండల కేంద్రంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చొరవ చూపారు. జెడ్పీ నిధులు రూ. 50 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నారు. 12 రూములతో నిర్మాణపు పనులు చకాచకా సాగుతున్నాయి. అదేవిధంగా గతంలో అసంపూర్తిగా ఉన్న ఐటీఐ (ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ)ను పూర్తి చేసేందుకు రూ. 5 కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా వెదురుకుప్పం పరిసర గ్రామాలకు తాగునీటిని పుష్కలంగా అందించేందుకు మారేపల్లె మద్దిమానుమడుగు ప్రాజెక్టు నుంచి నీటిని శుద్ధి చేసి అందించనున్నారు. దీనికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశారు.

ప్రగతికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రగతికి పెద్దపీట వేస్తోంది. ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి అడిగిన పనులకు వెంటనే నిధులు మంజూరు చేయిస్తున్నారు. నాలుగేళ్లలోనే ఈ తరహాలో అభివృద్ధి పనులు చేపట్టడం ప్రభుత్వ కృషికి నిదర్శనం. సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తోంది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. –ఎం. శిల్ప, సర్పంచ్, వెదురుకుప్పం

ఉప ముఖ్యమంత్రి పర్యటన నేడు

వెదురుకుప్పం: ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి సోమవారం వెదురుకుప్పం మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి తెలిపారు. ముందుగా సంతబయలు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం కలెక్టర్ షన్మోహన్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి మండల కేంద్రంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన వాణిజ్య సముదాయం, డ్రైనేజీ కాలువ, ఓవర్ హెడ్ ట్యాంకు, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించనున్నారు. అనంతరం బహిరంగ సభ జరుగుతుందని పేర్కొన్నారు. టీడీపీ నుంచి మాజీ ఎంపీపీ, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం నుంచి మళ్లీ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు.

యథేచ్ఛగా రహదారి ఆక్రమణ



పన్నూరు సబ్‌స్టేషన్ నాలుగు రోడ్ల కూడలి

విజయపురం (నగరి): మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ నాలుగు రోడ్ల కూడలి వద్ద షాపు యజమానులు, చిరువ్యాపారులు రహదారికి ఇరువైపులా రోడ్డు ఆక్రమించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇటీవల సిమెంట్ రోడ్డు వేసినా ప్రయోజనం లేకుండాపోతోంది. షాపు యజమానులు ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆక్రమించుకున్నారని గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. ఫలితంగా రాకపోకలు సాగించడం కష్టంగా ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డును సర్వే చేయాలని కోరుతున్నారు.

ఎమ్మార్పీకే మద్యం అమ్మకాలు



బలిజకండ్రిగలో రికార్డులను పరిశీలిస్తున్న మద్యం డిపో ఎస్‌ఐ

పాలసముద్రం: ప్రభుత్వ వైన్ షాపుల్లో ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు చేపట్టాలని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ శాస్త్రి అన్నారు. జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దయాసాగర్, డిపో ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వం మద్యం షాపులను ఆదివారం తనిఖీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రభుత నిబంధనలకు విక్రయాలు జరగాలని ఆదేశించారు. మద్యం అమ్మకాలపై గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సూపర్‌వైజర్లు ప్రతి రోజు ఉదయం 10.30 గంటలకు నగదును బ్యాంకులో జమ చేయాలన్నారు. రాత్రి వేళ దుకాణాల వద్ద కాపలాదారు తప్పనిసరి అన్నారు. లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆన్‌లైన్ ఆప్ ద్వారా స్టాకును పరిశీలించారు. వారి వెంట కానిస్టేబుల్ కుమార్ జాన్సన్, సూపరవైజర్లు ఉన్నారు.

బీడీ కార్మికుల కూలి పెంచండి

పుత్తూరు రూరల్: పుత్తూరు, కార్వేటినగరం ప్రాంతాల్లోని బీడీ కార్మికులకు కూలి పెంచాలని డిమాండ్ చేస్తూ స్థానిక సీఐటీయూ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చైతన్య మాట్లాడుతూ.. వెయ్యి బీడీలు చుట్టే వారికి రూ.500 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, బోనస్ అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 13న నెల్లూరులోని సీఐటీయూ కార్యాలయం వద్ద రాష్ట్ర సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి ఆలిండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి దెబాషిస్ రాయ్ పాల్గొంటారని తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు.

పేదలకు అన్నదానం



పెనుమూరులో పేదలకు అన్నదానం చేస్తున్న విజయ్‌కుమార్‌రెడ్డి

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కాగా సామిరెడ్డిపల్లెలో వైఎస్సార్‌సీపీ నేత యతీశ్వర్‌నాయుడు మనవరాలి కేశఖండన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో సాతంబాకం ఎంపీటీసీ యశోదారెడ్డి, ఉగ్రాణంపల్లె సర్పంచ్ మురళిరెడ్డి, నాయకులు అమీన్ బాషా, దూది మోహన్, నీలా పండరీనాథ్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

వాకర్స్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్రామిరెడ్డి

పుత్తూరు రూరల్: పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ సభ్యుల సేవలు అభినందనీయమని నగరి మున్సిపల్ కమిషనర్ కె.వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం వాకర్స్ అసోసియేషన్ అదనపు భవన నిర్మాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. అసోసియేషన్‌ను ప్రారంభించి, పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఒక సంఘం విజయవంతంగా నడుస్తుంటే దాని వెనక పటిష్టమైన నాయకత్వమే కారణమన్నారు. ఆ నాయకత్వ పాత్రను డాక్టర్ సమర్థవంతంగా పోషిస్తున్నారని కొనియాడారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ నడవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. తాను ఏడాది పాటు పుత్తూరులో పని చేశానని, అవకాశం వస్తే పుత్తూరు ప్రజలకు మళ్లీ సేవలందిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డిని సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు డాక్టర్ రవిరాజు, గుణశేఖర్‌రెడ్డి, గోపికృష్ణ, మురగేష్‌రెడ్డి, రామచంద్రనాయుడు, యుగంధర్‌రాజు, కుప్పయ్య శెట్టి, వెంకటేశ్వర్లునాయుడు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాపై అవగాహన కల్పిస్తున్న హరి

నగరి: యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు హరి గురూజీ అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని సరస్వతి విద్యామందిర్‌లో యోగా శిక్షణను ప్రారంభించారు. యోగా మెళకువలను నేర్పారు. యోగసాధన చేసే సమయంలో తీసుకోవాల్సిన ఆహార నియమాలను సూచించారు. నిత్యం యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో యోగా రిసోర్స్ పర్సన్‌లు ఎల్లప్పరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో అన్నదాతలు బిజీ



వరి నాట్లు వేస్తున్న మహిళలు

విజయపురం(నగరి): వానదేవుడు కరుణించడంతో మండలంలోని రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. వారం రోజుల క్రితం పడిన తేలిక పాటి వర్షానికే భూమి కాస్త పదునెక్కడంతో అదును దాటుతుందని ముందడుగు వేస్తున్నారు. బోర్ల ఆధారంగా వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. కొందరు వరి సాగు చేస్తున్నారు. మరికొందరు వరి నాట్లు వేస్తున్నారు. వేసవిలో తల్లిడిల్లిపోయిన రైతన్నలు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఊపిరి పీల్చుకుంటున్నారు. సాగుకు సరిపడే నీరు లేకపోయినా ప్రస్తుతం పోరు, బావుల్లో నీరు చేరడం ఆనందంగా ఉందంటున్నారు.

వైభవంగా సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం మహా సుదర్శన హోమ పూజలు చేశారు. ఉదయం స్వామివార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాత్తుమురై, ఆరాధన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ట్రస్టీ కేఎస్ శ్రీధర్, వాసు ఆధ్వర్యంలో అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, శేషాద్రిస్వామి, ద్వివేది వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సుదర్శన హోమం, పూజలు చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు ఏకాంత సేవ జరిగింది.

ఆహ్లాదం.. నగర వనం

- జిల్లాలో చిత్తూరు, పలమనేరులో నిర్మాణ పనులు
- కుప్పం, కార్వేటినగరంలో అనుమతులు మంజూరు





చిత్తూరులో సిద్ధమవుతున్న ఆర్చీ, పిల్లల పార్కు, వాకింగ్ ట్రాక్

నానాటికీ నగరం, పట్టణాల్లో పెరిగిపోతున్న కాలుష్యం ప్రజల ఆరోగ్యాలపై ప్రభావం చూపుతోంది. వాతావరణంలో కర్బన ఉద్గారాల శాతం తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం పెంపొందించే దిశగా నగర వనాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తోంది. విశాలమైన ప్రాంతం పిల్లలు ఆడుకోవడానికి ఆటవస్తువులు, చుట్టూ అడవి, ప్రవేశ ఆర్చీలతో నగరవన ప్రాంతాన్ని సుందరంగా నిర్మిస్తున్నారు. జిల్లాలో నిర్మిస్తున్న నగర వనాలపై కథనం.

చిత్తూరు కార్పొరేషన్: పచ్చదనం పెంపు, ప్రజలకు వినోదం, ఉల్లాసం, ఆరోగ్యం– కాన్సెప్ట్‌తో నగర వనాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉపక్రమించింది. చిత్తూరులోని ఆర్వీఎస్ నగర్ వద్ద, పలమనేరు, నగరవనాల పనులకు పూనుకుంది. అలాగే జిల్లాలోని జనావాసాలకు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది. పర్యాటకులకు ఆకట్టుకునే విధంగా ఈ వనాల్లో వసతులు కల్పించడంతో పాటు సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు.

నగరవన యోజన పథకం

జిల్లాలో జనావాసాలకు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వనాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి హెక్టార్‌కు రూ.4 లక్షల చొప్పున నిధులు ఇవ్వనున్నారు. చిత్తూరు నగరవనానిన 50 హెక్టార్లలో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.1.40 కోట్లు విడుదల చేశారు. అక్కడ రూ.11.66 లక్షలతో 2 బోర్లు వేసి, మోటార్ ఏర్పాటు చే, నీటి వసతి కల్పించారు. ఆర్చి, ఫెన్సింగ్, ఇతర అభివృద్ధి పనులకు రూ.40 లక్షలు వ్యయం చేశారు. నర్సరీలో పూలమొక్కలు, షో మొక్కల కోసం రూ.20 లక్షలు వెచ్చించారు. పిల్లల కోసం జారుడు బండ, ఉయ్యాల ఇలా మొత్తం 12 ఆట వస్తువులకు రూ.18 లక్షలు, పార్కుకు నీటి సరఫరా పైపులైన్, ఇతర పనులకు రూ.8 లక్షలు, వాకింగ్ ప్రాంతం ఏర్పాటుకు రూ.8.48 లక్షల చొప్పున ఇప్పటి వరకు రూ.1.06 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన సదుపాయాలు కల్పించి, మరో మూడు నెలల్లో నగర వనాన్ని ప్రారంభించాలనే ధ్యేయంతో పనులు చేస్తున్నారు. అలాగే పలమనేరులో 20 హెక్టార్లలో వనం నిర్మాణ పనులు చేస్తున్నారు. అక్కడ కూడా బోరు వేసి నీటి వసతి కల్పించారు. వీటితో పాటు పిల్లల పార్కు, రాశివనం, వాకింగ్‌ట్రాక్, నర్సరీ ఏర్పాటు చేశారు. వీటి కోసం రూ.20 లక్షలు ఖర్చు పెట్టారు.




పలమనేరు నగరవనాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి

మరో రెండు ప్రాంతాల్లో ..

కుప్పం, కార్వేటినగరంలో వనాల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.1.40 కోట్లు కేటాయించింది. ప్రతి నగరవనంలో వాకింగ్ ట్రాక్, ఆహ్లాదాన్నిచ్చే మొక్కలు, రచ్చబండ తరహాలో బెంచీలు, టాయిలెట్లు, లైటింగ్, ఆర్చ్, ఆర్వో ప్లాంట్, పార్కింగ్ ఏరియా, పిల్లలకు ఆటవస్తువులు సమకూర్చనున్నారు.

ప్రకృతి ఒడిలో రిలాక్స్



జిల్లాలో నగరవనాల ఏర్పాటుకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తోంది. కుటుంబ సభ్యులతో ప్రకతి ఒడిలో సేద దీరేందుకు వీటిని నిర్మిస్తున్నాం. చిత్తూరు, పలమనేరులో పనులు జరుగుతున్నాయి. కార్వేటినగరం, కుప్పంలో వనాల ఏర్పాటు ప్రణాళిక రూపొందిస్తున్నాం. – చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్‌ఓ

ఆకట్టుకున్న దుర్యోధన వధ



దుర్యోధన వధ ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని బాలాపురం ధర్మరాజులస్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తిరుత్తణి తాలుకా కేజీ కండ్రిగకు చెందిన కళాకారులు దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. నీటి మడుగులో ఉన్న దుర్యోధనుడిని భీమసేనుడు బయటకు రప్పించడం.. ఇద్దరి మధ్య యుద్ధ సన్నివేశాలు, దుర్యోధనుడి వధ సన్నివేశాలు అలరించాయి. దుర్యోధనుడిగా సుబ్బయ్య, భీమసేనుడిగా అల్లిముత్తు రక్తి కట్టించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రి స్వామివారి ఊరేగింపు, అగ్నిగుండ మహోత్సవం జరిగింది. తిలకించేందుకు స్థానికులతో పాటు తమిళనాడు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీ వద్ద శ్రీకాళహస్తి–తిరుపతి ప్రధాన రహదారిపై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి ఆదివారం రాత్రి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మేర్లపాక ఎస్సీ కాలనీవద్ద ఏపీ 39 యూఏ 8213 అశోక్ లేలాండ్ దోస్త్ ఎల్ఎస్ వాహనాన్ని ఆపి పోలీసులు తనిఖీ చేశారు. అందులో 4,030 కిలోల బియ్యం ఉన్న 79 ప్లాస్టిక్ బస్తాలను స్వాధీ నం చేసుకున్నారు. వీటి విలువ రూ.1,45,080. వాహనంతో పాటు రేషన్ బియ్యాన్ని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస మొదలియార్‌కు అప్పగించారు. బియ్యాన్ని తరలిస్తున్న కేవీబీపురం మండలం కోవనూరుకు చెందిన సాంబారు మనోజ్ (25)ను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.